కథ

# ఆఖరి

**ఎం.రమేష్‌కుమార్**

మిట్టమధ్యాహ్నం...

తీవ్రంగా ఉంది ఎండ..

మామిడిచెట్టు మీద కాకి దాహంతో అరుస్తూంది.

వీధి చివర కుక్క ఒకటి ఎండ తాపానికి తట్టుకోలేక కాబోలు అదో రకంగా మొరుగుతూంది.

ముత్యాలమ్మ ఎప్పటి మాదిరిగానే నులకమంచం మీద కూర్చొని ఉంది. ఎదురుగా చూస్తే ఎప్పుడూ కనిపించే దృశ్యమే. ఇనుప గ్రిల్స్ అవతల సిమెంటు రోడ్డు, ఆ పక్కనే మామిడిచెట్టు సిమెంటు రోడ్డుకీ, మామిడిచెట్టుకీ మధ్యగా మురిక్కాలువ... అదే దృశ్యం చూసిచూసి విసుగు పుడుతోంది ముత్యాలమ్మకు. అప్పుడప్పుడూ అటూ ఇటూ నడిచిపోయే మనుషుల అలికిడి కూడా లేదు. ఎండకు భయపడి ఎవరూ బయట తిరగడం లేదు.

ఎనభై ఏళ్లు దాటిన ముత్యాలమ్మ ముఖం ముడతలుగా సాగి ఉంది. శరీరంలో చర్మం ఎక్కడికక్కడ సాగి వేళ్లాడుతోంది. ముక్కున ఉన్న ముక్కెర కూడా సాగి కిందకు జారిపోయేట్టు కనిపిస్తోంది. విరబోసుకున్న జుట్టు మాత్రం నలుపు తెలుపుల కలబోతలా ఉంది.

అనుభూతుల్ని ప్రకటించటం మర్చిపోయిన గాజుకళ్లను చికిలించి బైటకు చూస్తోంది ముత్యాలమ్మ. ఎండ వేడికి చిరాగ్గా ఉందావిడకి. చీరచెంగుతో మొహం తుడుచుకొని పక్కనే ఉన్న విసనకర్రతో బలహీనంగా విసురుకోసాగింది.

మామిడిచెట్టు మీదున్న ఉడుత ఏదో పనున్నట్టుగా గబగబా చెట్టు దిగి చటుక్కున ఇనుప గ్రిల్ తలుపుల దగ్గరకొచ్చి ముత్యాలమ్మకు ఏదో చెప్తున్నట్టుగా మొహం చికిలించి శబ్దాలేవో చేసి మళ్లీ తుర్రున పారిపోయి చెట్టెక్కేసింది.

"నువ్వైనా నయం. అప్పుడప్పుడూ ఎలా ఉన్నానో చూసిపోతుంటావు" ఉడుతను చూసి ముత్యాలమ్మ నిట్టూర్చింది. ఒక్కసారిగా దిగులు ఆవరించిందామెను. 'ఇప్పుడు తనను పట్టించుకునే వారెవరున్నారు గనక..' ఆమె మనసు దిగులుగా మూలిగింది.

కొడుకు పట్నంలోని పప్పులమిల్లులో పనిచేస్తూ అక్కడే ఉంటాడు. వారానికొక్కసారే రావడం. కోడలు అట్టల కంపెనీలో పనిచేస్తోంది. సాయంత్రానికే ఆమె తిరిగి వచ్చేది. మనవడూ, మనవరాలూ సెలవులకు వాళ్ల అమ్మమ్మగారింటికి వెళ్లారు. తనేమో ఈ కుక్కిమంచంలో 'దేవుడా.. నన్నెప్పుడు పిలుస్తావు తండ్రీ.' అనుకుంటూ...

ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు తను పలకరించబోతే ఈ ముసల్దాంతో మాటలేంటన్నట్టు పక్కకి జరుగుతూ వెళ్లిపోతారు.

మనవడూ, మనవరాలూ తన దగ్గరికి రావడం మానేశారు. అంతా కోడలి తర్ఫీదు. కోడలు తనతో ఏం మాట్లాడినా కసిరినట్టుగానే మాట్లాడుతుంది. వారానికో సారొచ్చే కొడుకుతో ఏదైనా చెప్పబోతే "అబ్బ.. ఉండవే.. నా సమస్యల్తో నేను ఛస్తోంటే మధ్యలో నీ సొద ఒకటి" అంటూ విసుక్కుంటాడు. తనకేమో లేచి నాలుగడుగులు వేస్తే కాళ్లూ చేతులూ వణుకుతున్నాయి. కాలకృత్యాలు తీర్చుకోవడమే కష్టంగా ఉంది.

తనిప్పుడెవరికీ అఖ్ఖర్లేదు. ఆ దేవుడు తననెందుకు మర్చిపోయాడో అర్థం కావడం లేదు.

ముత్యాలమ్మ మనసు ఒకసారి గతంలోకి ప్రయాణించింది. ఎలాంటి కుటుంబం తనది. ఎంత పెద్ద సంసారం...! తనకి ఆరుగురు కొడుకులు. ముగ్గురు కూతుళ్లు. భర్త చిన సూర్నారాయణ చదువుకు జ్యూట్‌మిల్లులో మంచి నౌఖరీయే దొరికింది. అప్పుడు పల్లెల్లో ఆమాత్రం చదువుకున్న వాళ్లే కరువు.

పెళ్లయ్యే నాటికి తనకి చదువు రాకపోయినా భర్త నేర్పించిన అక్షరాల్తో తను పేపరు చదవగలిగే స్థాయికి వచ్చింది. తన ప్రవర్తన, భాష కూడా ఆయన వల్లనే కాస్త నాగరీకంగా మారాయి. ఆయన భక్తికి సంబంధించిన పుస్తకాలు ఎక్కువ చదివేవాడు. అప్పుడప్పుడు సాయంత్రం పూట తమ వీధి అరుగు మీద భక్తికి సంబంధించిన చర్చలు జరుగుతుండేవి.

తమ పిల్లల్లో నాలుగో వాడికి తప్ప మిగిలిన వారికి పెద్దగా చదువులు అబ్బ లేదు. అయితే భర్తకున్న పలుకుబడితో ముగ్గురు కొడుకులకి జ్యూట్‌మిల్లులోనే పనిలో చేర్పించగలిగారు. అప్పట్లో జ్యూట్‌మిల్లులో కార్మికుడికి కూడా మంచి విలువ ఉండేది. గవర్నమెంట్ ఉద్యోగంతో సమానమైన గుర్తింపు ఉండేది. రానురాను మిల్లు లాకౌట్లలో పడింది. దాంతో కార్మికుల కుటుంబాలు చితికిపోయాయి. కార్మికుడి బతుకు భారంగా మారింది.

నాలుగోవాడు మాత్రం కాస్త చదువుకొని రెవెన్యూ ఆఫీసులో గుమస్తాగా ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అయిదోవాడు ఆఖరివాడు. వాడు అందివచ్చేసరికి ఆయన గతించారు. వాడికి పప్పులమిల్లులో ఉద్యోగమే గతయింది. కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి, పిల్లలందర్నీ ఒక ఒడ్డుకు చేర్చేసరికి తమకున్న కొద్దిపాటి పొలం హరించుకుపోయింది. బంగారం కరిగిపోయింది. ఉన్న ఇల్లే మిగిలింది. ఇంకా అప్పులు ఉండటంతో ఆయన పోయాక కొడుకులు ఇల్లు అమ్మేసి అప్పులు తీర్చేశారు.

ఎవరి సంసారాలు వాళ్లవి అయ్యేక తననెవరి దగ్గరుంచుకోవాలా అని తర్జనభర్జన పడి చివరికి చిన్నాడింట్లో ఉంచటానికీ వాడికి మిగతా నలుగురూ నెలకి తలా కొంత ఇవ్వటానికీ నిర్ణయం చేసేరు. అలా అయితే చిన్నాడికి కూడా కాస్త వెసులుబాటుగా ఉంటుందని అనుకొన్నారు. నాలుగోవాడికి గవర్నమెంటు ఉద్యోగం కావటంతో అందరూ ఇచ్చే దానికంటే ఎంతో కొంత ఎక్కువే ఇస్తానని చెప్పాడు వాడు. తన పెన్షను డబ్బులు మాత్రం నెలనెలా పోస్టులో వేసే విధంగా ఏర్పాటు చేశారు.

ఆయన పోయి పన్నెండు సంవత్సరాలు గడిచాయి.

తనకిప్పుడు మనవలూ, మనవరాళ్లూ మొత్తం పద్దెనిమది మంది ఉన్నారు. తనది పెద్ద కుటుంబం అని ఎప్పుడూ గర్వపడుతుంటుంది ముత్యాలమ్మ.

ఆమధ్య మిగతా వాళ్లిచ్చే డబ్బులు సరిపోవడం లేదని చిన్నాడు గొడవ చేస్తే తలా కొంత ఎక్కువ ఇవ్వడానికి ఒప్పుకున్నారు మిగతా కొడుకులు. తన మందులకనీ ఎక్కువ ఖర్చులవుతున్నాయని ఈమధ్య కోడలు ఒకటే సణుక్కుంటోంది. ముసిల్దానికి సేవలు చెయ్యమని భగవంతుడు తనకి రాసి పెట్టాడని విసుక్కుంటూ ఉంటుంది. నిజానికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లేప్పుడూ స్నానం చేసుకొనేటప్పుడూ కాసింత ఆసరా ఇవ్వడం తప్ప కోడలు తనకి సేవలు చెయ్యడం అంటూ పెద్దగా ఏమీ లేదు.

ఈమధ్య తను జ్వరం పడినప్పుడు ఐదు రోజుల పాటు లేవలేకపోయింది. కోడలు మొదటిరోజే ఈ సేవలు చెయ్యడం తన వల్ల కాదంటూ గొడవ చేసింది. రెండో రోజుకల్లా తన చిన్నకూతురు కబురు తెలిసివచ్చింది.

తను బాగా తిరగ్గలిగేటప్పుడు కొడుకుల ఇళ్లకూ కూతుళ్ల ఇళ్లకూ అప్పుడప్పుడూ వెళ్లేది. అయితే కోడళ్లు ఒకచోట చేరినప్పుడు ఎలాగూ చిన్నకొడుక్కి డబ్బులు పంపుతున్నాం గదా ఈవిడ అక్కడే ఉండక ఇల్లిల్లూ తిరుగుతూ పెత్తనాలు చెయ్యడం ఎందుకో అని అనుకునే మాటలు చెవిని పడ్డాక ఎక్కడికీ వెళ్లడం మానేసింది. ఇంతకు ముందు కూతుళ్లు తన్ను చూడ్డానికి అప్పుడప్పుడు వచ్చిపోతుండేవారు. ఈమధ్య వాళ్లు కూడా రావడం పూర్తిగా తగ్గించారు. బహుశా తను ఇంకా ఎంత కాలం ఉంటుందో అని వాళ్లు కూడా చిరాకు పడుతున్నారేమో అనిపించింది ముత్యాలమ్మకు.

కావ్ కావ్‌మన్న శబ్దంతో ఆలోచనల్నుంచి తేరుకొంది ముత్యాలమ్మ. తలుపు మీద కాకి వాలి ఒకటే



అరుస్తోంది. ముత్యాలమ్మ విసనకర్రతో కాకిని అదిలించింది.

ముత్యాలమ్మకి ఎంతసేపూ ఈ నులక మంచంలో మగ్గిపోవడం గొప్ప విసుగ్గా ఉంది. కానీ ఏం చేస్తుంది? పోనీ నాలుగడుగులు వేసి పక్కనే ఉన్న రామకోవెలకైనా వెళ్లి కాసేపు కూచుందామనుకుంటే.. తన పక్కన చెయ్యి పట్టుకొని కాస్త ఆసరా ఇచ్చే వాళ్లుంటే తప్ప నడిచి వెళ్లలేని పరిస్థితి. అక్కడికీ శ్రీరామనవమి నాడు కోడల్ని అడిగింది- "రాముడి కళ్యాణం జరుగుతోంది కదే... కాస్త అక్కడి వరకూ తీసికెళ్లకూడదూ... పక్కనే కదా"

ఆ మాటతో కోడలు చర్రున లేచి "ఆ.. నువ్విప్పుడు అక్కడికెళ్లి కళ్యాణం చూడకపోతే వచ్చింది నష్టం. అయినా ముసిల్దానివి ముసిల్దాన్లా పడుండక నన్నెందుకు తింటావ్?" అంది. అంతే.. ఆ మాటతో తను మిన్నకుండిపోయింది.

కావడానికి ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లూ, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లూ. పెద్ద కుటుంబమే తనది. కానీ ఏం లాభం? తనతో మనసు విప్పి ఒక అరగంట మాట్లాడడానికి మనిషే లేదు. తనకు ఒక్క పూట తిండి పెట్టినా చాలు.. ఎవరైనా కాసేపు కూచుని తనతో మాట్లాడితే బాగుణ్ణు...ముత్యాలమ్మ ఆలోచిస్తూనే నెమ్మదిగా మగతలోకి జారుకుంది.

○○○

కొడుకులూ, కూతుళ్లూ, బంధువులు అందరూ ముత్యాలమ్మ ఎదుట కొలువుదీర్చినట్టుగా కూర్చొని ఉన్నారు.

ముత్యాలమ్మ కొన ఊపిరితో ఉంది.

నాలుగో వాడన్నాడు. "చూడమ్మా.. అందరం నీ దగ్గరే ఉన్నాం. ఒక్కసారి కళ్లు తెరిచి చూడవే"

ముత్యాలమ్మకి ఆ మాటలు వినిపించాయి. కళ్లు తెరిచిచూడ్డానికి ప్రయత్నించింది. అంతా మసక మసగ్గా ఉంది.

"నీ మనసులో ఏదైనా కోరికుంటే చెప్పమ్మా" పెద్దాడు అడిగాడు.

"అవును.. చెప్పమ్మా" మిగతా వాళ్లు వంతపాడారు.

ఇన్నాళ్లూ తన మనసులో ఏముందో కనుక్కొని తీర్చారా వీళ్లు? ప్రాణం పోయే సమయంలో ఏం తీరుస్తారు?

ముత్యాలమ్మకి తన చివరి క్షణాలు ఆసన్నమయ్యాయని తెలుస్తోంది. కానీ ఏమీ బదులివ్వలేకపోతోంది.

కూతుళ్లు కాబోలు.. ఏడుస్తున్నట్టున్నారు.. సన్నగా ఏడుపులు వినిపిస్తున్నాయి. తన మనస్సుకి అంతా చేరుతూనే ఉంది.

చివరి రోజుల్లో తనేమిటి ఆశించింది?

కాసింత ఆప్యాయత.. కాస్త అప్పుడప్పుడూ తన

బిడ్డలు వచ్చి పలకరించి. నాలుగు మాటలు మాట్లాడితే చాలనుకుంది. అంతకన్నా తనకు ఇంకే కోరికలున్నాయి? కానీ అదే జరగలేదు.

తను పోతున్నానని తెలిసి అందరూ వచ్చి చేరారు.. ఏం లాభం? ఇప్పుడు తను ఎవరితోనూ మాట్లాడే పరిస్థితిలో లేదు. తను పోయాక బహుశా వీళ్లంతా తన గురించి మాట్లాడుకుంటూ కర్మకాండలూ అవీ.. పూర్తి చేస్తారు.

బతికున్నప్పుడు తనతో రెండు మాటలు మాట్లాడలేని వాళ్లు పోయాక తన కోసం మాట్లాడుకొంటారు.

పోయేటప్పుడు ఎలాగూ ఒంటరిగా పోక తప్పదు.. కానీ చివరి రోజుల్లో తనకా గంపెడు మంది అయిన వాళ్లు ఉన్నా కూడా తను ఒంటరే అయ్యింది. ఆలోచనలు కదిలిపోతుండగానే ముత్యాలమ్మకి. తన శరీరంలో నుంచి ప్రాణశక్తి ఏదో వేరై ఎగిరిపోతున్నట్లనిపించింది.

ooo

ఒక్కసారి దిగ్గున కళ్లు తెరిచి మేలుకొంది ముత్యాలమ్మ. ఒళ్లంతా చెమటల్లు పట్టేశాయి.

ఎలాంటి కల వచ్చింది?


నిజంగానే తన ఆయుష్షు తీరిపోతోందా? తన చావు దగ్గిరపడిందా? పోయినా ఫర్వాలేదు. కానీ తను పోయే ముందు కలలో కనిపించినట్టుగానే నిజంగా అందరూ వస్తారా?

ముత్యాలమ్మకి నమ్మకం కలుగలేదు. లేదు.. కాదు.. తను పోయానన్న వార్త వింటేగానీ బహుశా అందరూ చేరుకోరేమో?

తన మనసులోని మాటలు మనసులోనే మిగిలిపోతాయి కాబోలు.

ముత్యాలమ్మకు నీరసం ఆవహించింది... 'భగవంతుడా... నన్నెందుకు మర్చిపోయావు..' అనుకుంటూ మనసులోనే దుఃఖపడసాగింది.

సాయంత్రమైనట్టుంది. బైట కాస్త గాలి వీస్తోంది. ఏదో కాగితం ఎగురుకుంటూ మంచం పక్కకు వచ్చింది. ముత్యాలమ్మ ఏవిటా అని వంగుని దాన్ని తీసింది. పుస్తకాలకు అట్టలు వేసుకోవడానికి పిల్లలు తెచ్చుకున్న న్యూస్‌పేపర్లోది అది. పక్కన పడేయబోతూ మనసు మార్చుకుని పక్కనే ఉన్న విరిగిన కళ్లజోడు తగిలించుకుంది ముత్యాలమ్మ. కళ్లజోడున్నా అక్షరాలు మసగ్గానే ఉన్నాయి. అంతలో ఏదో వార్త ఆమె దృష్టిని ఆకర్షించింది. నెమ్మదిగా కూడబలుక్కుంటూ ఆ వార్త మొత్తం చదవసాగింది ముత్యాలమ్మ. ఆమె గాజుకళ్లలో ఏదో దీప్తి ప్రవేశించింది.



ooo

శనివారం రాత్రి ఇంటికి వచ్చిన కొడుకుతో-

నాలుగో వాణ్ని ఒకసారి తన దగ్గరికి రమ్మని చెప్పమని చెప్పింది ముత్యాలమ్మ.

"ఇప్పుడు వాడెందుకే?" అన్నాడు చిన్న కొడుకు.

"కాదురా.. ఒక్కసారి వాణ్ని రమ్మను. వాడితో మాట్లాడాలి" మర్నాడు కూడా అదే పాట పాడసాగింది ముత్యాలమ్మ.

తల్లి పోరు పడలేక అమ్మ నీతో మాట్లాడాలంటోందంటూ నాలుగో వాడికి కబురందించాడు.

నాల్రోజుల తర్వాత తీరిక చూసుకొని తల్లి దగ్గరకొచ్చాడు నాలుగో కొడుకు. అమ్మ తనతో ఏదో ముఖ్యమైన విషయమే చెప్పాలనుకుంటోందని నాలుగో వాడు అనుకున్నాడు. తను గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నానని కుటుంబంలో తనే తెలివైన వాణ్నని అమ్మ నమ్మకం.

కాబట్టే తనతోనే ఏదో చెప్పాలనుకుంటోందని భావించాడతను.

ముత్యాలమ్మ కొడుకుని తన దగ్గర కూచోబెట్టుకుంది.

"ఒరేయ్.. ఇంతదాకా మిమ్మల్నేటీ అడిగింది లేదు. ఈ ఒక్క మాట మాత్రం మీరు కాదనకూడదురా"

"ఏంటమ్మా.. ఏం కావాలి నీకు?" అడిగాడు కొడుకు.

"ఏం లేదురా అదేదో ముసలాళ్ల అనాథాశ్రమమట. నన్నందులో చేర్పించరా" ఆశగా అడిగింది ముత్యాలమ్మ.

"ఏంటమ్మా నువ్వనేది?" తల్లేం చెప్తోందో సరిగ్గా అర్థం కాలేదు కొడుక్కి.

"అది కాదురా.. పేపరు ముక్కలో సదివాను ఆశ్రమంలో ముసలాళ్లను జాగ్రత్తగా చూసుకుంటారట గదా.. ఎంతో కొంత దబ్బు కట్టాలంట. నా పింఛను దబ్బులు కూడేత్తన్నాను గదరా. అయ్యిచ్చేద్దాం.. సాలకపోతే మీరు తలా కొంత ఏసుకుంటే సరి. ఏవంటావు?"

"అదేంటి? నువ్వెందుకే ఆశ్రమంలో చేరడం?" తల్లికి మతిగానీ పోలేదుకదా... అనుకుంటూ ఆశ్చర్యపడుతూ అడిగాడు కొడుకు.

"కాదురా, అక్కడందరూ నాలాంటి ముసలాళ్లే వుంటారంట గదా. ఆళ్లతో మాటాడుకుంటూ నాకూ కాలం గడిసిపోద్ది. నన్నందులో సేర్పించరా నాయనా... బాబ్బాబ్బూ.." ముత్యాలమ్మ కొడుకుని ప్రాధేయపడసాగింది.

తల్లి కోరికని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ నివ్వెరపోయి చూడసాగాడు కొడుకు.

కొడుకేం చెప్తాడో అని అతని మొహంలోకే చూడసాగింది అతి పెద్ద కుటుంబానికి పెద్ద దిక్కైన ముత్యాలమ్మ.

## క్షణ క్షణముల్...!

ఐశ్వర్యా రాయ్ పెళ్లి కంటే ముందే సల్మాన్ ఖాన్ పెళ్లి జరిగిపోతుందని అప్పట్లో జోరుగా వినిపించింది. కానీ అదేమీ కాలేదు. అయితే ఈ ఏడాది చివరికల్లా తన ప్రియురాలు కత్రినా కైఫ్‌ని సల్మాన్ పెళ్లి చేసుకోబోతున్నాడని తాజాగా వినిపిస్తున్న వార్తలు. కానీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న తన సినీ కెరీర్ పట్ల కత్రినా శ్రద్ధ వహిస్తోందని, పెళ్లి విషయమై ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతోందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కత్రినా నుంచి పెళ్లికి 'సరే' అనే మాట కోసం సల్మాన్ ఎదురుచూస్తున్నాట్ట. మరి కత్రినా మనసులో ఏముందో?